నమస్తే ఆంధ్ర.కాం
సకల వార్తల విందు
namastheandhra.com ...news all the way

# 'తెలుగు సంబరాలకు' సన్నాహాలు షురూ!

నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) వారు జులైలో నిర్వహించబోయే అమెరికా తెలుగు సంబరాలకు సన్నాహాలు చాలా చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలను ఓర్లాండో లోని ఆరంజ్ కౌంటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆర్థిక మాంద్యం దెబ్బకు అమెరికాలోని ఎన్నారైల జీవితాలు కూడా ప్రభావితం అవుతున్న నేపథ్యంలో ఈ మహాసభలకు హాజరయ్యే వారు చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ రుసుమును కూడా చాలా అందుబాటు ధరల్లో నిర్ణయించినట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో http://www.sambaralu.org/online-registration.php యూఆర్ఎల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా వారు కోరుతున్నారు.

అలాగే కన్వెన్షన్ సెంటర్‌కు సమీపంలో వసతి సదుపాయం కావాల్సిన వారికి కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. కన్వెన్షన్ సెంటర్‌కు పక్కనే రెండు హెూటళ్లలో ఆకర్షణీయమైన ధరలకు లభ్యం అవుతాయని వివరించారు. ది పీబాడీ ఓర్లాండో మరియు రోజెన్ సెంటర్ హెూటల్ లలో గదులు రిజర్వు చేసుకోదలచిన వారు http://sambaralu.org/hotels.html యూఆర్ఎల్ ద్వారా కూడా చేసుకోవచ్చు.

ఓర్లాండో మహాసభలకు సకుటుంబంగా హాజరయ్యే వారికోసం నాట్స్ మరిన్ని ఏర్పాట్లు చేస్తోంది. నాట్స్ గ్రూప్ ధరకే లభించే హెూటలు గదులు, సభల తేదీలకు ముందు, ఆ తరువాత కొద్ది రోజుల పాటూ కూడా సభ్యులకు లభించే ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల సభలకు వచ్చేవారు మరి కొన్ని రోజుల పాటూ ఓర్లాండోలో గడిపి ఓర్లాండో అందాలను పూర్తిగా ఆస్వాదించే వీలుంటుంది. ఓర్లాండో ప్రాంతంలోని థీమ్‌పార్కులు, ఇతర ఆకర్షణీయ స్థలాల టికెట్ల విషయంలో కూడా సభల అతిథులకు రాయితీలు పొందేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారు.

మహాసభలలో వివిధ వయో వర్గాల వారిని కలగలిపి వేడుకను ఘనంగా నిర్వహించేందుకు మంచి వినోదాత్మక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు చలనచిత్ర ప రిశ్రమలో అటు ఆధ్యాత్మిక, ఇటు కమర్షియల్ సంగీతాన్ని అందించడంలో అందెవేసిన ఎం.ఎం.కీరవాణి.. ఇంకా జానపత సంగీత రీతులకు ప్రాణం పోసే వందేమాతరం శ్రీనివాస్ ఈ వేడుకల్లో సభికుల్ని అలరించనున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి కాజల్, నమిత, బుజ్జిగాడు ఫేం సంజన, నేనింతే ఫేం శియ తదితరులు కూడా సభలకు అదనపు అందాలను సమకూర్చనున్నారు.

ఈ సభల గురించి ఎప్పటికప్పుడు తాజా వివరాలను తెలుసుకోవడానికి http://www.sambaralu.org వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా వారు కోరుతున్నారు.